01062024-DIS-08_Layout 1 6/1/2024 2:42 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

పరాయితనపు బతుకు భయానకం

శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
90309 97371

మన ముందు తరం వారు ఎవరంటే... ఆ ముందు తరం వారు వేసిన తిరుగు బాటు విత్తనాలే. వారు మొలకలై, మానులై, శాఖోపశాఖలుగా తెలంగాణతనం వ్యాపింపచేసిన్రు. ఆకాశమంత ఎత్తున బావుటా ఎగరేసిన్రు. అదే సమయంలో భూమి పొరల్లోకి వేళ్లూనిన్రు. అస్తిత్వం ఎంత బలంగా లోలోనికి చొచ్చుకుపోతే ఆకాంక్ష అంతే ఎగిసిపోతది ఆకాశంలోకి.

రెండు మూడు తరాల త్యాగాల ఫలితంగా, కల్వకుంట్ల చంద్రశేఖర రావు అనే విప్లవ కారుడి రాజకీయ నేతృత్వం వల్ల పదేండ్ల కింద తెలంగాణ సిద్ధించింది. ఈ సామాజిక వాస్తవం విస్మరించి, 'సోనియాగాంధీ అనే ఇటలీ అమ్మాయి తెలంగాణ ఇచ్చింది' అని అండశ్రీ అన్నరంటే... ఆయనకు ఈ నేల ఏమి అర్థమయినట్టు? బ్రిటిష్ వాళ్లు మనకు స్వాతంత్ర్యం ఇచ్చిన్రు అనడం లాంటి మందబుద్ధి ఇది!

ఒక గొప్ప కళాసృష్టి (Work of art) ఒకానొక కాలంలో అగ్గి రాజేసి ఉండవచ్చు, ఉద్రూతలుగించి ఉండవచ్చు, అది ఎప్పటికీ గొప్పది గానే నిలిచిపోవచ్చు కూడా. కానీ, అనంతర కాలంలో ఆ కళాసృష్టి చేసినవారి తీరు సృష్టి (Work) వెనుక నున్న తాత్వికతకే అపసవ్య దిశలో సాగుతూ ఉంటే? ఇది కదా విషాదం? ఇపుడు అండెశ్రీ ఒక గూడు కట్టుకుని ఉన్న, ఆనవాలు కోల్పోతున్న, అస్తిత్వం ఉడిగిపోతున్న, ప్రశ్నిస్తే ఉడుక్కుంటున్న 'కొత్త తెలంగాణ'కు సాక్షి, భాగస్వామి కూడా!

'కేసీఆర్ ఆనవాలు లేకుండా చేస్తా' అని ఏ ముహూర్తంలో అన్నారో రేవంత్ రెడ్డి! భాగోళిక రాష్ట్రం నుంచి తెలంగాణ తనపు జాడ కూడా కనిపించకుండా చేయడంలో ఓవర్ టైం పని చేస్తున్నడతను. తెలంగాణ ఆనవాలు తీసేస్తే, కేసీఆర్ ఆనవాలు పోయినట్టే అనే ఎరుక ఉండటం రేవంత్ రెడ్డి గొప్పతనం కాదు అది తెలంగాణ నుంచి కేసీఆర్‌ను విడదీయలేరనే నగ్న సత్యం!

విచిత్రమూ, విషాదమూ ఏమంటే ఈ 'తెలంగాణ చెరిపివేత'లో రేవంత్‌రెడ్డికి కొందరు తెలంగాణ బిడ్డలు సహకరిస్తూ ఉండటం! వాగ్దానాలో, వాగ్దాన భంగాలో ఎక్కడో వీరికి వ్యక్తిగతంగా కేసీఆర్‌తో చెడింది. To be fair to them – అవి ఆస్తులూ, అధికారాల గురించి కాకపోవచ్చు. అపాయింట్‌మెంట్ అడిగితే ఇవ్వలేదని కినుక కూడా కావచ్చు. అలకలోనే అలసి పోయే అల్పత్వమా అని మీరంటే, నేనేమీ చేయలేను!

ఈ రాష్ట్ర సాధకుడి దురదృష్టం ఏమంటే ఆయన ద్వారా రాష్ట్రం సహా అన్నీ పొందినవారు సైతం ఆయనను అర్థం చేసుకోలేకపోవడం! వీలైతే నాలుగు రాళ్లేసి పోవడం! మెరమెచ్చు మాటలు, డాంబికాలు, హిపోక్రసీ లాంటివి మచ్చుకు కూడా లేని కేసీఆర్ ఎవరిలోనూ ద్వంద్వ ప్రవృత్తి సహించరు. అది మింగుడు పడని మేధావి వర్గమే నాడు ఆయనకు వ్యతిరేకంగా, నేడు రేవంత్‌కు బాసటగా నిలబడింది!

అండెశ్రీ 'జయ జయహే' గీతం గురించి ఉద్యమ సీఎం కేసీఆర్ పాట నిడివికి సంబంధించి ఒకటి రెండు మార్పులు సూచించినట్ర. అవి నచ్చని అండెశ్రీ దూరంగా ఉండిపోయినట్ర. ఆ తర్వాతి కాలంలో అండెశ్రీ ఇతర ప్రొఫెసర్లూ, మేధావులతో కలిసి కేసీఆర్ మీద (బీఆర్ఎస్ మీద కాదు!)రాళ్లేయడం మొదలుపెట్టిన్రు.

రేవంత్ రెడ్డి అనే ఒక మరుగుజ్జు (భౌతికంగా కాదు) వీరందరికీ నచ్చుతున్నరు. కారణం సింపుల్. వాళ్లు వ్యతిరేకించింది కేసీఆర్ అనే వ్యక్తినే గానీ, సీఎంగా ఆయన సాధించిన వెలుగులను కాదు! ఇపుడు మెచ్చి మేకతోలు కప్పుతున్నది వారికి అడిగి నప్పుడల్లా చాయ్ తాగనీకి సమయం ఇస్తున్న రేవంత్‌రెడ్డికే గానీ, పాలన గాలికి వదిలేసిన సీఎంకు కాదు!సారాంశంలో ప్రజలు, సమాజం, ప్రగతి, సంక్షేమం, దేశవ్యాప్త కీర్తి వీటి ముందు అల్పమైనయి. వ్యక్తిగత ఆభిజాత్యాలు ముఖ్యమైనయి!

రాష్ట్ర లోగో నుంచి తెలంగాణ అస్తిత్వ, సాంస్కృతిక చిహ్నాలను తొలగించే దుస్సాహసం చేసిన రేవంత్ రెడ్డి, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో 'నిర్ణయాన్ని' వాయిదా వేసిన్రు. 'ఆయన తెలంగాణ వ్యతిరేక చర్యను నిస్సిగ్గుగా సమర్థించిన కోదండరాం ప్రభృతులు ఇపుడు ఆత్మరక్షణలో పడిపోయిన్రు' అనడానికి కూడా లేదు.

ప్రమాదం సమసిపోలేదు. అరుంధతి సినిమాలో పశుపతి పాత్ర లాగ మరలా రెచ్చిపోతరు, సందు చూసుకుని. వారికి వంతపాడే తెలంగాణ ద్రోహ మీడియా ఎటూ ఉన్నది కదా! నిన్నా మొన్నా తిరగబడినట్టు సమాజం ఎప్పటికప్పుడు తెలంగాణ ద్రోహంపై తిరగబడాల్సిందే. అందుకు తాత్విక భూమికయే బీఆర్ఎస్ పార్టీ! చిహ్నాల విషయంలో ప్రభుత్వ వెనుకంజ తెలంగాణకు నైతిక బలం, బీఆర్ఎస్ ప్రాసంగికతకు రుజువు!

మంగలి షాప్‌లలో, రచ్చకట్టల మీదా, చాయ్ దుకాణాల దగ్గరా పామరులు వీరికంటే లోతైన వారు! ఒక వైపు దేశానికి మోదీ లాంటి నాయకుడు కావాలి అనే వారు కూడా, రాష్ట్రానికి కేసీఆర్‌ను మించిన మొనగాడు లేడనడం స్వయంగా నేను విన్న. కేసీఆర్ చేసిన కొన్ని తప్పులు అంటూ లెక్కపెట్టి మరీ చెప్తరు వారు. అయితే, కొద్ది పాటి శిక్షతో సరిపోయేది కదా (కొన్ని సీట్లు తగ్గించి), అయనను దించేసి తమను తామే శిక్షించుకోవాలా అని కూడా వారిలో మళ్లీ సంవాదం! ఎందుకంటే సామాన్య ప్రజలు కేసీఆర్ పాలనను చవిచూసిన్రు. అభివృద్ధి-సంక్షేమం-ఆత్మగౌరవాలు హక్కుగా అందుకున్నరు. చుట్టుపక్కల ఉన్న ఏ రాష్ట్రంతో పోల్చినా ఈ పదేండ్లలో మెరుగైన తమ జీవనం అద్దంలో చూపినట్టు కనబడుతూనే ఉన్నది దినమూ. కాబట్టే, మొన్న షేక్‌పేట్ గోవింద్ అన్నడు ఇన్ని చేసిన సారు, అంత పెద్ద తప్పు ఎట్లా చేసిండని! ఆయన కోపం ఏమంటే, సారు దిగిపోయి రేవంత్‌రెడ్డిని సీఎం చేసిండు కదా అని. గోవింద్ లాంటి వాళ్లది ధర్మాగ్రహం. అందుకే అంటు

న్నరు పల్లె ప్రజలు మా ఎమ్మెల్యే ఓడిపోతే ఏమైతది, సారే సీఎంగా ఉంటరు అనుకున్నం అని! ఎంతో ప్రేమ, అంతలోనే నిష్కారం, వెంటనే చిగురించే ఆశ కేసీఆర్‌పై తెలంగాణ ప్రజలకు!

సామాజిక అంశాలపై లోతైన విశ్లేషణలు చేసే ఆంధ్రజ్యోతి సంపాదకుడు కె.శ్రీనివాస్ సైతం మొన్న దురదృష్టకరమైన ఒక వ్యాసం రాసిన్రు. ప్రతి పేజీ లోనూ, ప్రతి అక్షరంలోనూ బీఆర్ఎస్‌పై, తెలంగాణపై విషం చిమ్ముతున్న ఆ పత్రిక యాజమాన్యపు పాలసీ ప్రైజర్‌కు కె. శ్రీనివాస్ కూడా గురవుతున్నరేమో అనేట్టుగా పార్టీ పేరు మార్పును కూడా సైద్ధాంతిక చర్చ చేసిన ఆయన... తమ పత్రిక పేరు 'తెలంగాణ జ్యోతి'గా మార్చకపోతే రాజీనామా చేస్తా అని ఎవరికీ వినపడకుండా అయినా డిమాండ్ చేసి ఉంటే బాగుండేది. చిహ్నాలను మాత్రమే కాదు, తెలంగాణ అస్తిత్వాన్ని చెరిపేయడానికి పూనుకున్న రేవంత్‌ను, ఆయనకు తందాన కొట్టే ఆర్కేను వదిలేసి బీఆర్ఎస్ సాంక్టిటీని ప్రశ్నించడం గడుసుదనం!! ఏమన్న అంటే, కాంగ్రెస్‌నూ విమర్శిస్తున్నం కదా అంటరు – తలుపు చెక్కతో బీఆర్ఎస్‌ను బాదుతూ, తమలపాకుతో కాంగ్రెస్‌ను తడుముతూ! ఆర్కే పూనిన శ్రీనివాస్ ఇంకా ఏమంటరంటే – బీఆర్ఎస్ చీలిపోయి కొత్త పార్టీ రావాలట! ఇదెక్కడి సామాజిక కార్యకర్తృత్వం? అదేమి వ్యాసం. పార్టీల చీల్చివేత రాజకీయంతో మీకేమి పని, మీ ఇంట్రెస్ట్ ఏంది?!

ఈ ప్రశ్నలు, ఈ జాగరూకత తెలంగాణ సమాజం తన కోసం కలిగి ఉండాలి. ఎందుకంటే... రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రేపు జూన్ 2తో తెలంగాణపై అన్ని హక్కులు కోల్పోబోతున్నది ఆంధ్రప్రదేశ్. ముఖ్యంగా హైదరాబాద్‌పై. పదేండ్ల ఉమ్మడి రాజధానికి ముగింపు ఆ రోజుతో. మహాకవి శ్రీశ్రీ అన్నట్టు ప్రపంచంలోని అందరు ప్రజలూ మంచివారే. ఆంధ్ర ప్రదేశ్ ప్రజలతో కూడా ఏమీ పేచీ లేదు తెలంగాణకు. మనం అలర్ట్‌గా ఉండాల్సింది అక్కడి రాజకీయ పార్టీలు, నాయకులు, మీడియా సహా పెట్టుబడిదారులు, వలసవాదులతో. మరీ ముఖ్యంగా వారి తాబేదారుడైన ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రితో. మొన్ననే అన్నరు రేవంత్ తిరుపతిలో.. 'రాబోయే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్త'నని. ఆయన అలవోకగా ఏమీ అనలేదు. ఆంధ్రలో కూటమి అధికారంలోకి రావాలని చంద్రబాబు కంటే ఎక్కువగా కోరుకుంటున్నరు రేవంత్ రెడ్డి, ఆయన మిత్రుడు రాధాకృష్ణ! అపుడు తెలంగాణలో వారు ఆడింది ఆట, పాడింది పాటగా సాగుతుందని ఉవ్విళ్లూరుతున్నరు.

చంద్రబాబుకు గానీ, రాధాకృష్ణకుగానీ వారి షడ్యంత్రం సాగాలంటే రేవంత్ రెడ్డిని మించిన నమ్మకస్తుడు దొరకడు. బ్రిటిష్ వారికి ప్రజల ధన, మాన, ప్రాణాలను దోచిపెట్టిన భారత సామంత రాజుల లాంటివాడు రేవంత్ రెడ్డి! ఇవేవీ కేవలం వ్యక్తుల పేర్లు కాదు. వీరు ఆంధ్రా పెట్టుబడిదారుల, వలసవాదుల ప్రతీకలు, ప్రతినిధులు, ప్రతిరూపాలు. ఇందులో ఈషణ్మాత్రం సందేహం ఉండనక్కరలేదు!

ఈ వ్యాసం రాస్తున్న సమయంలోనే వచ్చిన వార్త.. హైదరాబాద్‌లో 100 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం కోసం రేవంత్‌రెడ్డిని కలవనున్నట్టు టీడీపీ వెల్లడించింది. అండెశ్రీ గీతం కీరవాణి పాలయింది. ఏ ఒక్క పబ్లిక్ మీటింగ్‌లోనూ 'జై తెలంగాణ' పలుకలేదు సీఎం. జూన్ 2న తెలంగాణ ఉద్యమకారులను గౌరవించడం కోసం వారి లిస్టు తయారుచేయమని కోదండరాంకు చెప్పిండు రేవంత్‌రెడ్డి. ఆ లిస్టులో రేవంత్‌రెడ్డి పేరు చేరుస్తరో లేదో కోదండరాం, చూడాలి!

ఆర్నెళ్ల నుంచి అరిగోస పడుతున్న రైతాంగంపై కత్తి కట్టిండు రేవంత్‌రెడ్డి. వాళ్లకు కరెంటు ఇవ్వక, నీళ్లివ్వక, బోనస్ ఇవ్వక, రైతుబంధు ఇవ్వక, పంట కొనక... సమయమంతా కేసీఆర్‌ను బద్నాం చేయడానికి రాధాకృష్ణతో కలిసి రోజూ విషపు వంటకం వండుతున్నడు. ఆ ఇద్దరి కక్ష నిజానికి కేసీఆర్‌పై కంటే కూడా తెలంగాణపైనే. తెలంగాణ ఆనవాలు లేకుండా చేయడం కోసమే వీరు కృతనిశ్చయంతో ఉన్నరు. రాష్ట్ర చిహ్నాలను తొలగించడం ఆ పెద్ద కుట్ర తాలూకు ఒక tip of the iceberg మాత్రమే! అభివృద్ధి, సంక్షేమం నిలిచిపోయినయి ఆర్నెళ్లుగా. దానికంటే ముఖ్యంగా తెలంగాణ సంస్కృతి విచ్ఛిన్నమవుతున్నది. చిహ్నాలు మారడమే కాదు... తెల్లవారిని గొప్పవారు అనుకునే స్థితిలోకి ఆఫ్రికన్లను నెట్టినట్టుగా ఇపుడు తెలంగాణ మేధావులకు తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి, వారసత్వం పనికిమాలినవి అయిపోతున్నయి.

'కీరవాణి కంటే గొప్ప సంగీత దర్శకుడిని తెలంగాణలో చూపించు' అని అండెశ్రీ అనడం ఈ దిగజారుడుతనానికి మేలిమి ఉదాహరణ. పాట అనేది తెలంగాణ ఇరుసు. ఈ మట్టిలో పుట్టిన ప్రజా కవులు, రచయితలు, గాయకులు లెక్కకు మిక్కిలి! తెలంగాణ మట్టి మనుషులు వారు. అడవితో, వెన్నెలతో, హక్కుతో, బాధ్యతలతో, పంచాయితీతో, పార్లమెంట్‌తో, రాష్ట్రంతో, దేశంతో అన్నిటితో ముడిపడిన బతుకు చిత్రాన్ని ప్రభావవంతంగా ప్రకటించే వాగ్గేయకారులకు నెలవు ఈ నేల. వారు రాసి, బాణీ కట్టి, స్వయంగా పాడే పాటలకు ఏ అంతర్జాతీయ దిగ్గజకుడు కూడా ఆత్మను ప్రకటించే సంగీతం ఇవ్వలేడు.

అండెశ్రీ 'జయ జయహే' పాటకు అసలు సంగీతమే అక్కర్లేదు. మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ పెట్టుకోవచ్చు, కానీ ఆ అరేంజ్‌మెంట్ చేసేవారు ఆస్కార్ అవార్డు గ్రహీత కాబట్టి, ఆయనకు మించి తెలంగాణకు దిక్కులేదని అండెశ్రీ అనడం నిజంగా విషాదం. ఆయనకూ, మిగిలిన ఆత్మ చచ్చిన తెలంగాణ వారికి ఒక ప్రశ్న. నాడు అండెశ్రీ గీతం నిడివి ఎక్కువ ఉందని, జాతి గీతం కోసం కొంచెం కుదిద్దామని (ఇపుడు మనం పాడుకునే 'జన గణ మన' కూడా కుదించిన గీతమే అని మనవి) అప్పటి సీఎం కేసీఆర్ ప్రతిపాదిస్తే నిరాకరించిన, ఆ తర్వాత కేసీఆర్ తనను పట్టించుకోలేదని అభాండాలు వేసిన అండెశ్రీ... ఇపుడు రేవంత్‌రెడ్డి, కీరవాణి మ్యూజిక్‌కు ఎట్లా డ్యాన్స్ చేస్తున్నడో చూస్తున్నరు కదా? ఇది కదా నిజమైన దరిద్రం!!

అభివృద్ధి-సంక్షేమాలు ముందో, వెనుకో నడుస్తనే ఉంటయి. ఆత్మ చచ్చిన తర్వాత, అస్తిత్వం కనుమరుగైన తర్వాత, తెలియని బానిసత్వంలోకి మరలా కూరుకుపోయిన తర్వాత... భాష, యాస, ఆహారం, ఆహార్యం, ఆచారం, వ్యవహారం అన్నింటా పరాయితనం ఆవరించిన తర్వాతి బతుకు ఎంత భయానకం? జూన్ 2, 2014కు ముసుపటి చీకటి రోజులు మరలా వస్తున్నయనే ప్రమాద హెచ్చరికలు రోజూ జారీ అవుతూనే ఉన్నయి, భయం గొలుపుతూనే ఉన్నయి.

ఇందులోంచి తేరుకొని, రేవంత్ రెడ్డి చేస్తున్న 'తెలంగాణ చెరిపివేత'పై నాటి ఉద్యమస్ఫూర్తితో 33 జిల్లాల సకలజనుల భాగస్వామ్యంతో ధిక్కార స్వరం వినిపించాలె. తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు మనమంతా నడుం కట్టాలె. రాష్ట్రావతరణ నాడు మనం పునరంకితం కావాలె. జాగో తెలంగాణ!

చంద్రబాబుకు గానీ, రాధాకృష్ణకుగానీ వారి షడ్యంత్రం సాగాలంటే రేవంత్ రెడ్డిని మించిన నమ్మకస్తుడు దొరకడు. బ్రిటిష్ వారికి ప్రజల ధన, మాన, ప్రాణాలను దోచిపెట్టిన భారత సామంత రాజుల లాంటివాడు రేవంత్ రెడ్డి! ఇవేవీ కేవలం వ్యక్తుల పేర్లు కాదు. వీరు ఆంధ్రా పెట్టుబడిదారుల, వలసవాదుల ప్రతీకలు, ప్రతినిధులు, ప్రతిరూపాలు. ఇందులో ఈషణ్మాత్రం సందేహం ఉండనక్కరలేదు!

'నా మాటే శాసనం' అనడమే రాచరికం

ప్రేమ్‌రాజ్

తెలంగాణ ప్రతీసారి తన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి పోరాడుతూనే ఉన్నది. ఆంధ్రా వలస పాలకుల కాలంలో అదే పోరాటం. రాష్ట్ర అవతరణ జరిగిన తర్వాత కూడా అదే పోరాటం. తెలంగాణ నిరంతరం తన ఉనికిని, గుర్తింపునీ చాటుకోవాల్సి రావడం విషాదం. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా అధికారిక చిహ్నం, రాష్ట్ర గీతం విషయాల్లో జరుగుతున్న చర్చ ఇందుకు తార్కాణం.

తెలంగాణ రాష్ట్రానికి ఒక అధికారిక గీతం ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అండెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ' అనే గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రభుత్వం నిర్ణయించింది. ఆ పాటకు ప్రముఖ సంగీత దర్శకులు కీరవాణి చేత స్వరకల్పన, సంగీత రచన చేయించాలని నిర్ణయించారు. ఈ బాధ్యతను అండెశ్రీ అభీష్టానికి వదిలేసినట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా కొన్ని ముఖ్యమైన అభ్యంతరాలు తెలంగాణ పౌర సమాజం నుంచి వ్యక్తమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర గీతానికి ఆంధ్రా సంగీత దర్శకుడు అవసరమా అన్న ప్రశ్నకు అండెశ్రీ చాలా అభ్యంత రకరమైన సమాధానం చెప్పారు. కీరవాణిని తలదన్నే సంగీత దర్శకుడు తెలంగాణలో ఎవరున్నారో తీసుకురండి అని అండెశ్రీ సవాలు విసిరారు. తెలంగాణలో సంగీత దర్శకులు లేరని అండెశ్రీ నిశ్చిత అభిప్రాయం. కీరవాణి సంగీత ప్రతిభ అందరూ ప్రశంసించిందే. ఆయన గొప్పతనం ఆస్కార్ దాకా చేరిన సంగతి జగద్విదితం. అంతటి గొప్ప సంగీత దర్శకుడు తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు తెలంగాణ కావాలని పాడే ఒక్క పాటకూ సంగీతం ఎందుకు సమకూర్చలేదు? ఆ కాలంలో అండెశ్రీ కీరవాణితో ఎందుకు తన పాటలకు సంగీత రచన చేయించుకోలేదు? స్వరాష్ట్ర ఉద్యమ కాలం నుంచి ఇప్పటివరకు అండెశ్రీ పాటలన్నింటికీ సంగీతం సమకూర్చింది తెలంగాణ వాళ్లే. తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్యం చేసి ఉర్రూతలూగించిన అనేక పాటలకు అద్భుతమైన సంగీతం అందించిన వాళ్లంతా తెలంగాణవాళ్లే అన్నది నిజం. కానీ, తెలంగాణలోని సంగీత దర్శకులు కీరవాణి కన్నా తక్కువ స్థాయివాళ్లు అని అండెశ్రీ అభిప్రాయం. సరిగ్గా ఇలాంటి అభిప్రాయాలనే నిజాం కాలంలో ఆంధ్రా కవులు ప్రకటించారు.

తెలంగాణలో కవుల్లేరని ఒక మహానుభావుడు అహంకారపూరితంగా చేసిన వ్యాఖ్యలకు సమాధానంగానే గోలకొండ కవుల సంచిక వచ్చింది. అస్తిత్వ పరిరక్షణ, ఆత్మ గౌరవం, స్వయంపాలన కోసమే తెలంగాణ ఉద్యమం మొదలైంది. ఆత్మగౌరవం కోసమే తెలంగాణ యువకులు వందలాది మంది ప్రాణాలను బలిదానం చేశారు. ఆ పోరాటంలో పాల్గొని వేదికల మీద పాటలు పాడిన అండెశ్రీ తెలంగాణలో మేటి సంగీత దర్శకులు లేరని అంటున్నారు. తెలంగాణ ప్రజలను ఆంధ్రవాళ్ల లాగే అవమానిస్తున్నారు.

గత పాలకులు రాష్ట్ర గీతాన్ని పెట్టలేదని, జయ జయహే తెలంగాణ పాటను పక్కనపెట్టారని, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రాష్ట్ర గీతంగా అండెశ్రీ రాసిన పాటను ప్రకటించి సముచిత గౌరవాన్ని చాటిచెప్పిందని పాలక పార్టీ మద్దతుదారులు అంటున్నారు. గత పాలకులకు అండెశ్రీకి మధ్య ఏం జరిగిందో తెలియదు గాని ఇప్పటి పాలకులు మంచి నిర్ణయం తీసుకున్నందుకు అభినందించాలి. అయితే, ఇప్పుడు లేవనెత్తిన ప్రశ్నలకు ఆ వాదనకు పొంతన లేదు. ఆ పాట స్వరకల్పనకు తెలంగాణ సంగీత దర్శకులు అనర్హులా? తెలంగాణ సంగీత దర్శకులు ఇంతమంది ఉండగా ఆంధ్రా ప్రాంతానికి చెందిన కీరవాణినే ఎందుకు ఎంచుకోవాలి? తెలంగాణ ఉద్యమానికి కీరవాణి కాంట్రిబ్యూషన్ ఏమిటి? అది ఉద్యమ సందర్భంలో పుట్టిన పాట కాబట్టి మేము ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలంగాణ కవులు, కళాకారులు, ఉద్యమకారులు అంటున్నారు. గత పాలకులు బతుకమ్మ పాటను ఏఆర్ రెహమాన్‌తో చేయిస్తే, ఎవరూ అభ్యంతరం చెప్పలేదని మరొక వాదనను ముందుపెడుతున్నారు. బతుకమ్మ తెలంగాణ ప్రజల పండుగ. ఏడాదికి ఒకసారి మాత్రమే ఆ పండుగ వస్తుంది. కానీ, రాష్ట్ర గీతాన్ని ప్రతీ రోజు పాడాలి. ప్రతీ సందర్భంలో దాన్ని ఆలపించాలి. అది అధికారిక గీతం. రెండింటి సందర్భం వేరు. రెండింటి ప్రాధాన్యాలు వేరు. ఏఆర్ రెహమాన్‌కు తెలంగాణ కల్చరల్ లైఫ్ తెలియకపోవడం వల్లనే ఆ పాటకు మంచి స్వర, సంగీత రచన చేయలేకపోయాడన్నది నిర్వివాదాంశం. అదేవిధంగా కీరవాణికి కూడా తెలంగాణ జీవనం తెలియదు. హైదరాబాద్‌లో నివసించినంత మాత్రాన ఒకరికి తెలంగాణ అస్తిత్వ, తెలంగాణ భావోద్వేగాలు అర్థమవుతాయని అనుకోలేం.

అలాగే మరో వాదనేమంటే, గతంలోనే జయజయహే తెలంగాణ పాటను ఒక ఆంధ్రా గాయకుడు రామకృష్ణ పాడాడు కదా? ఇప్పుడు కీరవాణి సంగీతం చేస్తే అభ్యంతరమెందుకు అన్నది ఆ వాదన. ఆ పాటను పాడమని దివంగత బాలసుబ్రహ్మణ్యంను అడిగితే ఆయన నిరాకరించారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఆ పాటను రామకృష్ణ పాడారు. అప్పుడది రాష్ట్రగీతం కాదు. ఇప్పుడున్న సందర్భం వేరు. ఒకసారి రాష్ట్ర గీతంగా ప్రకటించగానే అది ప్రభుత్వానికి, ప్రజలకు సంబంధించిన గీతం అవుతుంది. దాని మీద ప్రభుత్వానికి హక్కులుంటాయి. రాసిన కవికి ప్రతీకాత్మక సంబంధమే ఉంటుంది. కానీ, దానికి విరుద్ధంగా, ఎవరు సంగీత దర్శకుడు ఎవరుండాలన్నది కవి ఇష్టానికి వదిలేయడం సరైంది కాదు. ఇంతమంది ఈ విషయంలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్నప్పుడు ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం అప్రజాస్వామికం.

అధికారిక చిహ్నంలో రాచరిక చిహ్నాలు ఉండరాదని రేవంత్ రెడ్డి అంటున్నారు. చార్మినార్, కాకతీయుల కళాతోరణం తెలంగాణ వారసత్వ సంపద. అవి తెలంగాణ అస్తిత్వాన్ని, గౌరవాన్ని చాటిచెప్పే నిర్మాణాలు. వాటిని నిర్మించినవాళ్లు రాజులే కావొచ్చు. కానీ, వాటికి రాళ్లు ఎత్తింది, నిర్మించిందీ తెలంగాణ వాళ్లు. అందుకే, అవి తెలంగాణ ప్రజా జీవితంలో విడదీయలేని గుర్తులయ్యాయి. ఇప్పటికే ఆర్కియాలజీ డిపార్టుమెంటు కాకతీయుల కోటను పునరుద్ధరించడానికి బదులు శిథిలావస్థకు చేర్చింది. ఆర్కియాలజీ నిబంధనలకు విరుద్ధంగా చార్మినార్ చుట్టుపక్కల ప్రాంతం అంతా దురాక్రమణలకు గురైంది. ఇక అధికారిక చిహ్నం నుంచి వాటిని తొలగిస్తే, వాటి భౌతిక నిర్మాణాల రక్షణకు దిక్కు ఉండదు.

అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవడం సరికాదు. నా మాటే శాసనం అనడమే రాచరికం. రేవంత్‌రెడ్డి నిరంకుశంగా, ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం రాచరికం కాదా? రాచరికం అనేది ఫ్యూడల్ లక్షణం. రాష్ట్ర అవతరణ దినోత్సవ సమయంలో ప్రజాభీష్టానికి విరుద్ధంగా ముఖ్యమంత్రి ప్రవర్తిస్తే, అది రాచరికానికి ప్రతీక అవుతుందన డంలో సందేహం లేదు.

(వ్యాసకర్త: రచయిత, దర్శకుడు
తెలంగాణ సినిమా కార్మిక సంఘాల
సమాఖ్య అధ్యక్షుడు)

ఎటమటం?



పోస్టల్ బ్యాలెట్లు లేవా?

పక్క రాష్ట్రం ఆంధ్రాలో పోలింగ్ ముగిసింది మొదలు పోస్టల్ బ్యాలెట్లపై జరుగుతున్న రాద్ధాంతం అంతాఇంతా కాదు. చివరకు రాజకీయ పార్టీలు కోర్టుల తలుపులు తట్టాయి. పోస్టల్ బ్యాలెట్లపై కొన్నిచోట్ల గెజిటెడ్ అధికారి స్టాంప్ లేకపోవడం ఈ వివాదానికి ప్రధాన కారణం. తెలంగాణలో కూడా పోస్టల్ బ్యాలెట్ల సంఖ్య తక్కువేం కాదు. 2.08 లక్షల వరకు ఉన్నట్టు అధికారిక సమాచారం. మరి ఇక్కడ గెజిటెడ్ అధికారుల సంతకాలు, స్టాంపులు ఉన్నాయా? లేవా? అన్నది ఏ పార్టీకీ పట్టడం లేదు. ఇదేదో తమకు సంబంధం లేని వ్యవహారంగా ఎన్నికల అధికారులెవరూ నోరు విప్పడం లేదు. ఉద్యోగుల ఓట్లు గంపగుత్తగా తమకే పడతాయని కలలు కంటున్న కమలనాథులు సైతం నోరు మెదపక పోవడం ఆశ్చర్యకరం.

చేతగాక.. చేతబడి అన్నట్టుంది

ఆడలేక మద్దెల ఓడు అన్నది పాత సామెత. చేతగాక.. చేతబడి అన్నది కొత్త సామెత. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రతిపక్ష పార్టీ కేరళ తాంత్రికులతో 'రాజకంటకం' పేరిట చేతబడి చేయిస్తున్నదని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చేసిన ఆరోపణ సోషల్ మీడియాలో తెగ వైరలైంది. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, పరిపాలన చేతగాక.. చేతబడి చేశారంటూ అధికార కాంగ్రెస్ కొత్త నాటకానికి తెరతీసిందని అక్కడి ప్రతిపక్షం ఆరోపిస్తోంది. ఈ చేతబడి కర్ణాటకకే పరిమితం అవుతుందా? లేక తెలంగాణకు కూడా పాకుతుందా? అనేది చూడాలి.



అది కూటమి భేటీనా?

రాష్ట్ర అవతరణ వేడుకలపై సచివాలయంలో జరిగిన అఖిలపక్ష భేటీకి తమను ఎందుకు పిలువలేదని బీఆర్ఎస్, బీజేపీ అధికార పక్షాన్ని తప్పుబడుతున్నాయి. అయితే అసలు దాన్ని అఖిలపక్షం అని అన్నదెవరని కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు ప్రశ్నించారు. జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో ఉన్న పార్టీలనే ఆహ్వానించినట్టు ఆ నేత చెప్పుకొచ్చారు. అందుకే తెలంగాణ ఉద్యమంలో లేకపోయినా కూటమిలో ఉందనే కారణంగానే సీపీఎంను ఆహ్వానించినట్టు చెప్పారు. అలాంటప్పుడు ఎంఐఎం పార్టీ కూడా కూటమిలో లేదు కదా? ఆ పార్టీని ఎలా పిలిచారని ప్రశ్నించగా.. అందుకే ఆ పార్టీ నుంచి ఎవరూ హాజరుకాలేదని అన్నారు. ఇక్కడ కూడా ఆప్, సమాజ్‌వాదీ పార్టీలకు శాఖలు ఉన్నాయి. మరి తమనెందుకు పిలువలేదని అడిగితే ఏం చెబుతారో మరి?

సోం'బేర్'

'మీ కంటే మేం దేంట్లోనూ తక్కువ కాదు. మీకు బూమ్ బూమ్ బీర్లు ఉంటే.. మాకు సోం'బేర్లు' ఉన్నాయి' అని తెలంగాణ మద్యం ప్రియులు